
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

శనివారం 28 డిసెంబరు 2024

రావి ఆకుపై మన్మోహన్‌సింగ్ చిత్రం

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ శివకుమార్ రావి ఆకుపై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రాన్ని మలచి నివాళులు అర్పించారు.

-నారాయణఖేడ్, (ఆంధ్రజ్యోతి)



సర్వే 70 శాతమే

మొరాయిస్తున్న సర్వర్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 27: ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాల్సిందిగా ఈ నెల 12 నుంచి సర్వే ప్రారంభించింది. మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 18,082 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 12,737 ఇళ్లు మాత్రమే సర్వే చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సర్వేకు నేడు చివరి తేదీ అయినప్పటికీ పూర్తిస్థాయిలో పరిశీలన చేయక పోవడం గమనార్హం. మెదక్‌లో 8,095 దరఖాస్తులకు 4,614, నర్సాపూర్‌లో 3,266 దరఖాస్తులకు 2,482, తూప్రాన్‌లో 3,770 దరఖాస్తులకు 3,694, రామాయియంపేటలో 2,951 దరఖాస్తులకు 1,947 మాత్రమే పరిశీలించారు.

రోజుకు రెండే..

ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి ఫొటోలను అప్‌లోడ్ చేసే సమయంలో సర్వర్ మొరాయిస్తుండడంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఒకటి రెండుసార్లు ప్రయత్నించినా సర్వర్ పని చేయకపోవడంతో ఏంచేయాలో తెలియక ఉసూరుమంటున్నారు. ఒక్కో రోజు రెండు దరఖాస్తులు మాత్రమే పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో గడువు లోపు సర్వే పూర్తి చేయలేకపోయామని అధికారులు పేర్కొంటున్నారు.



వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన సర్వే సిబ్బంది



మాజీ ప్రధాని దివంగత మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించిన నిర్మలాజగ్గారెడ్డి

- దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది
- ఆర్థిక సంస్కర్త మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక సంస్కర్త అని, ఆయన్ని కోల్పోవడం దేశానికి తీరని లోటని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అనేక కొత్త ఆర్థిక సంస్కరణలు తెచ్చిన ఘనత మన్మోహన్‌సింగ్‌కే దక్కిందన్నారు. ఆయన మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. పనికి ఆహార పథకం, ఆధార్, సమాచార హక్కు చట్టం, విద్యా చట్టం తదితర ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ తోపాజి అనంతకిషన్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్‌గౌడ్, సిద్దన్న పాటిల్, నాగరాజు, సోహైల్, కసిని రాజు, చిత్తారి యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



- సైబర్ నేరాల్లో టాప్
- మట్టి కలిసిన మానవ సంబంధాలు
- పెరిగిన హత్యలు, అత్యాచారాలు
- దొంగతనం కేసుల్లో ఆస్తుల రికవరీ భేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 2024లో సంగారెడ్డి జిల్లా నేరాలతో అట్టుడుకిపోయింది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం జిల్లాలో జరిగిన నేరాలు ప్రజలను ఆందోళన కలిగించాయి. మానవ సంబంధాలు మంట కలిసాయి. తండ్రి, కొడుకులు, అన్నదమ్ములు మధ్య సంబంధాల్లో డబ్బు చిచ్చు పెట్టింది. ఆస్తి కోసం హత్యలకు దారి తీసింది. ఆస్తి కోసం జరిగిన హత్యలు గత సంవత్సరంతో పోల్చితే వంద శాతం పెరిగింది. ఆస్తి కోసం హత్యలు గత సంవత్సరం 5 అయితే ఈ యేడు 10 హత్యలు జరిగాయి. హత్యలు గతేడాది 53 జరుగగా ఈ యేడు 55 చోటుచేసుకున్నాయి. కిడ్నాపులు, అత్యాచారాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. గత సంవత్సరం 48 కిడ్నాపులు జరుగగా ఈ సంవత్సరం 88 జరిగాయి. అత్యాచారాలు గత సంవత్సరం 100 అయితే ఈ యేడు 131 చోటు చేసుకున్నాయి.

పెరిగిన దోపిడీలు, దొంగతనాలు

గత సంవత్సరం కంటే ఈసారి దోపిడీలు, దొంగతనాల సంఖ్య 112 శాతం పెరిగింది. గత యేడు 17 దోపిడీలు జరిగితే ఈ సంవత్సరం 36 జరిగాయి. సాధారణ దొంగతనాలు గతేడాది 420 జరిగితే.. ఈ సంవత్సరం 639 జరిగాయి. గొలుసు దొంగతనాలు గత సంవత్సరం 15 జరుగగా ఈ యేడు 21 చోటుచేసుకున్నాయి. దొంగతనాల్లో బాధితులు పోగొట్టుకున్న ఆస్తుల్లో రికవరీ శాతాన్ని పోలీసులు పెంచారు. గతేడాది రూ.7,03,16,705 విలువ గల ఆస్తులు పోగొట్టుకోగా రూ.1,85,53,010 రికవరీ చేశారు. అలాగే ఈ సంత్సరం రూ.7,55,31,071 విలువ గల వివిధ వస్తువులు పోగా ఈసారి అందులో 49 శాతం రూ.3,73,21,274 ఆస్తులను రికవరీ చేశారు.

ప్రమాదాలు పెరిగినా.. తగ్గిన మరణాలు

ఈ ఏడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగినప్పటికీ మరణాల సంఖ్య మాత్రం తగ్గింది. ఇందుకు పోలీసులు జిల్లాలో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, రోడ్డు భద్రతా నిబంధనలేనని తెలుస్తోంది. గతేడాది 827 రోడ్డు ప్రమాదాలు జరిగితే 432 మంది మృత్యువాత పడగా, 781 మంది గాయపడ్డారు. ఈ ఏడాది 852 రోడ్డు ప్రమాదాలు జరుగగా 384 మంది మృతి చెందారు. 913 మంది క్షతగాత్రులయ్యారు. గతేడాది 11,404 కేసులు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి రూ.1,15,55,200 జరిమానాలు వేయగా 50 మందికి జైలు శిక్ష పడింది. ఈ ఏడాది 8,676 కేసులు చేసి రూ.1,13,50,293 జరిమానాలు వేసి 65 మందికి జైలు శిక్ష వేశారు. అలాగే పేకాటను అరికట్టేందుకు గత సంవత్సరం 67 కేసులు చేయగా, ఈ ఏడాది 105 కేసులు నమోదు చేశారు. రూ.21,33,295 నగదును సీజ్ చేశారు.

గంజాయిపై ఉక్కుపాదం

సంగారెడ్డి జిల్లా కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్నందున గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగేది. గంజాయి రవాణాపై పోలలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి స్మగ్లర్లు అనేక విధాలుగా పోలీసుల కళ్లు గప్పేందుకు ప్రయత్నించినా వాటిని పోలీసులు విచ్ఛిన్నం చేశారు. గతేడాది 5 గంజాయి కేసులు నమోదు చేసి 26 మందిని అరెస్టు చేయగా ఈ ఏడాది 34 కేసులు పెట్టి 79 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇక పక్కదారి పడుతున్న పిడిఎస్ బియ్యాన్ని కూడా అడ్డుకట్ట వేశారు. గతేడాది 66 కేసులు పెట్టి 6,645 క్వింటాళ్ల బబియ్యం పట్టుకున్నారు. ఈ ఏడాది 85 కేసులు నమోదు చేసి 15,139 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాల ఛేదనలో జిల్లా బేష్ : ఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం నేరాల సంఖ్య పెరిగినప్పటికీ వచ్చే ఏడాది మరింత ప్రణాళికతో నేరాలను అడ్డుకొనేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సంవత్సరం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన రూ.47,84,40,786 నగదు నుంచి రూ.5,90,33,430 నగదు హోల్డ్ చేయడం జరిగిందని ఆయన వివరించారు. గత సంవత్సరం మార్చి నెలలో ప్రారంభించిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు 5,111 దరఖాస్తుల్లో 2512 సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి 971 ఫోన్లను బాధితులకు అప్పగించడం జరిగిందని వివరించారు. జిల్లాలో మొత్తం 793 సైబర్ కేసులు నమోదు చేయగా రూ.47,21,18,596 నగదును బాధితులు కోల్పోయారు. సకాలంలో స్పందించిన జిల్లా పోలీసులు రూ.5,93,93,055 నగదును బాధితుల ఖాతాలకు తిరిగి ఇప్పించారు. ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమం ద్వారా 3,707 ఆటోలకు స్టిక్కరింగ్ వేయించి ప్రయాణికులకు భద్రత కలల్పించామన్నారు. అలాగే, జూన్ 13న అమీన్‌పూర్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన తల్లీ కూతుళ్లను రక్షించినట్టు గుర్తుచేశారు. కాగా జిల్లాలో గతేడాది జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రజలకు కతజ్ఞతలు తెలిపారు.

పోషకాహార లోపం..
చిక్కిపోతున్న బాల్యం

ఆరేళ్ల లోపు పిల్లల్లో పెరుగుతున్న రక్తహీనత

మెదక్ జిల్లావ్యాప్తంగా 1,717 మంది చిన్నారుల్లో లోపం

ఫలితమివ్వని ప్రభుత్వ పథకాలు

పర్యవేక్షణ లోపంతో సరుకులు పక్కదారి

6



జీజీహెచ్ వద్ద పోలీస్ అవుట్ పోస్ట్

- పూర్తిస్థాయిలో ఏర్పాటుకు చర్యలు
- 24 గంటలు విధుల్లో సిబ్బంది

7

చిచ్చుపెట్టిన ఎక్సైజ్ అధికారులు

- కల్లు దుకాణం హద్దులు మార్చడంతో వివాదం
- అధికారుల చుట్టూ రెండు గ్రామాల గీత కార్మికుల ప్రదక్షిణలు

8



మల్లన్నకు కల్యాణ కళ

- రేపే కొమురవెళ్లి కోరమీసాల స్వామి మనువు
- నేడు వీరశైవ పీఠాధిపతి రాక
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు

7



పంచాయతీ
సమరానికి ఏర్పాట్లు

సంగారెడ్డి జిల్లాలో 12 మంది అధికారులకు బాధ్యతలు

646 గ్రామ పంచాయతీలు, 5,718 వార్డులు

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. గ్రామ పంచాయతీలవారీగా ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను విడుదల చేసిన అధికార యంత్రాంగం పోలింగ్ కేంద్రాల తుది జాబితాపై కసరత్తు చేసింది. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ కోసం సంగారెడ్డి జిల్లాలో 12 మంది నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 646 గ్రామ పంచాయతీలు, 5,718 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. 8,51,420 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 4,23,629 మంది పురుషులు, 4,27,739 మంది మహిళలు, 52 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలో 5,732 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. బ్యాలెట్‌బాక్సులతో పాటు ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరింది.

12 మంది అధికారులకు బాధ్యతలు

పంచాయతీ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా జిల్లాలో 12 మంది నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల కోడ్ అమలు, ఎన్నికల సామగ్రి, వ్యయ పరిశీలన, అభ్యర్థుల ఖర్చు, ఫిర్యాదుల స్వీకరణ తదితర అంశాలను వీరు పరిశీలించనున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఎన్నికల అధికారులు వీరే..

అంశం	అధికారి పేరు
ఎన్నికల ప్రవర్తన నియామవళి	జానకిరెడ్డి
ఎన్నికల సిబ్బంది నియామకం	వెంకటేశ్వర్లు
బ్యాలెట్ పెట్టెల నిర్వహణ	అఖిలేష్‌రెడ్డి
రవాణా పర్యవేక్షణ	వెంకటరమణ
శిక్షణా కార్యక్రమలు	రామాచారి
ఎన్నికల సామగ్రి తరలింపు	శ్రీనివాస్‌రెడ్డి
వ్యయ పర్యవేక్షణ	కిరణ్‌కుమార్
ఎన్నికల పరిశీలకులు	జగదీష్
బ్యాలెట్ పత్రాలు	బాల్‌రాజ్
మీడియా కమ్యూనికేషన్	ఏడుకొండలు
హెల్ప్ లైన్	గీత
రిపోర్టులు, రిటర్నులు	సాయిబాబ

కొబ్బరికాయల వేలం రూ. 10.30లక్షలు

గుమ్మడిదల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్న వీరభద్రస్వామి ఆలయంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ కార్యదర్శి శశిధర్‌గుప్తా, పర్యవేక్షకుడు శ్రీధర్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. బొంతపల్లికి చెందిన వైనర్సింహ రూ.10,30,000లకు దక్కించుకున్నాడు. వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఈవో శశిధర్ గుప్తా వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు సురభినాగేందర్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మద్ది ప్రతాపరెడ్డి, కావలి శంకర్ గ్రామ పెద్దలు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.


వేలంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు




కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం



నష్టపరిహారం కోసం చర్చలు జరుపుతున్న కౌన్సిలర్, నాయకులు

జిన్నారం, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ తరపున ఢిల్లీకి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. బొల్లారం మున్సిపాలిటీకి చెందిన కడారు కిషన్(38) ఎక్సెల్ రబ్బరు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇటీవల పరిశ్రమ తరపున మరో కార్మికుడితో కలిసి పరిశ్రమ పనికోసం కిషన్ ఢిల్లీ వెళ్లాడు. అక్కడ తాము నివాసముంటున్న లాడ్జిలో ఇద్దరూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని శుక్రవారం పరిశ్రమ యాజమాన్యంతో మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి చర్చించారు. ఇద్దరు కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కరరెడ్డి, మునీర్, బషీర్, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి : టీజేఎంయూ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న జరిగే కేబినెట్ సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగుల ఫిట్‌మెంట్ ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనమైన తేదీ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ప్రణాళిక వాగ్దానానికి అనుగుణంగా 1.4.2021 నుంచి హక్కుగా కార్మికులకు అమలు కావాల్సిన వేతన సవరణ 45 నెలలుగా జాప్యమైన దృష్ట్యా రాబోయే మీటింగ్‌లో 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఎన్నికల వాగ్దానాన్ని నిలుపుకోవాలని కోరారు.









పోషకాహార లోపం.. బాల్యానికి శాపం

● ఆరేళ్లలోపు పిల్లల్లో పెరుగుతున్న రక్తహీనత సమస్య
● మెదక్ జిల్లాలో 1,717 మంది చిన్నారుల్లో లోపం


మెదక్ పట్టంలోని ఓ కేంద్రంలో పిల్లల బరువును కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

మెదక్ అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బడికెళ్తున్న బాల్యం బలహీనపడుతోంది. పోషక విలువల లోపంతో ఎదుగుదల క్షీణిస్తోంది. చిన్నారులు ఆరోగ్యంగా ఉంటూ.. ఎత్తుకు తగ్గ బరువు పెరగాలంటే పోషకాహారం అవసరం. ఎదిగే వయసులో పిల్లలు అనారోగ్యం బారిన పడకుడా ఉండాలంటే తల్లిదండ్రులు సమతుల ఆహారం అందించాలి. కానీ అవగాహన లోపం, అందని పౌష్టికాహారం వారిని మరింత బలహీనుల్ని చేస్తోంది. పరుగులిడాల్సిన వయసులో నీరసం, నిట్టూర్పులే మిగులుతున్నాయి. పేదరికం ఒక శాపమైతే.. సరైన వైద్యం అందకపోవడం మరో శాపగ్రస్తమైంది. చిన్నారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా.. మార్పు కనిపించడం లేదు. చిన్నారుల్లో పోషకాహార లోపం ఆందోళన కలిగిస్తోంది. ఆరేళ్లలోపు పిల్లలను రక్తహీనత వేధిస్తోంది. మెదక్ జిల్లా వ్యాప్తంగా 1,718 మంది చిన్నారులు పోషకాహారం లోపంతో బాధపడుతున్నట్లు అధికారుల గణంకాలు పేర్కొంటున్నాయి.

పర్యవేక్షణ లోపం.. సరుకులు పక్కదారి..

మహిళలు గర్భం దాల్చిన నుంచి పిల్లలకు ఆరేళ్ల వయసు వచ్చే వరకు ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నాయి. పిల్లలు పుట్టిన ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు బాలమృతం, నెలకు 16 కోడిగుడ్లు ఇస్తున్నారు. 3-6 ఏళ్లలోపు వారికి భోజనం, నెలకు 30 ఉడికించిన కోడిగుడ్లను అందజేస్తున్నారు. పోషకాహారంతో బాధపడుతున్న వారికి బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నారు. కానీ ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో నామమాత్రంగా అమలవుతుందనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల భోజనం ఉడకడం లేదని విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపంతో కొన్ని కేంద్రాల్లో సరుకులు పక్కదారి పడుతున్నాయి. పిల్లల ఎదుగుదల, ఆహార నిల్వలు, గర్భిణులు, బాలింతల టీకాల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

వెయ్యికి పైగానే అంగన్‌వాడీలు

జిల్లాలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 0 నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 31,288 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 22,299 మంది మొత్తం 53,585 మంది ఉన్నారు. వీరిలో తక్కువ బరువు చిన్నారులు 1,717 మంది కాగా, అతి తక్కువ బరువు చిన్నారులు 322 మంది ఉన్నారు. అవగాహన లోపంతో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం లేదు. బాలామృతం ప్లస్‌ను పిల్లలకు ఇవ్వడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయడం.. అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖల మధ్య సమన్వయ లోపంతో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు.

ప్రత్యేక దృష్టి పెడితేనే...

ఇలా ఇబ్బందికర స్థితిలో ఉన్న చిన్నారులను ప్రతి కేంద్రం వారీగా అడపాదడపా గుర్తిస్తున్నప్పటికీ వారిపై ప్రత్యేక శ్రద్ధ మాత్రం కరవవుతోంది. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే భవిష్యత్తులో ఈ గణంకాల పరంగా మెరుగైన ఫలితాలు కనిపించే వీలుంటుంది. కేవలం పౌష్టికాహారాన్ని కేంద్రాలకు పంపిణీ చేయడంతోనే బాధ్యత అయిపోయిందని భావించకుండా వయసుల వారీగా తగిన ఆహారాన్ని అందించాలి. కేలరీలతోపాటు మాంసకృత్తులు, కొవ్వు, ఇనుము, తదితర పోషకాలు సరిగ్గా అందే విధంగా చూడాలి. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాగే ఉంటూ ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అతి తక్కువ పోషణలోపాలున్నవారికి అదనంగా గుడ్లు, పాలు, బాలామృతం అందజేస్తున్నాం. సరుకుల పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పిల్లల ఎదుగుదల, ఆహార నిల్వలు, గర్భిణులు, బాలింతల టీకాల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నాం.

-హైమవతి, జిల్లా సంక్షేమాధికారి, మెదక్

మహిళా బ్యారక్ ప్రారంభం

నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మహిళా బ్యారక్‌ను డీఎస్పీ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది కూర్చోవడానికి, సేద తీరడానికి ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు బ్యారక్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం, మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు సన్మానం

మనోహరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల జమ్మూ కాశ్మీర్‌లో 20 నుంచి 24 వరకు జరిగిన 37వ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు బంగారు పతకం సాధించింది. ఈ మేరకు తెలంగాణ సబ్ జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు దుల్లపల్లిలోని తన నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ మెదక్ జిల్లా ట్రెజరర్ గోవర్ధన్‌గౌడ్, కుమార్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వెంకట్, రాజు క్రీడాకారులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


సంగారెడ్డిలో అభివాదం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌యూటీఎఫ్ 6వ రాష్ట్ర మహాసభలు 28వ నుంచి 30వ తేదీవరకు నల్లగొండ పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.సాయిలు తెలిపారు. మహాసభలకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని శుక్రవారం సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావా రవి, ప్రజాకవి సుద్దాల అశోక్‌తేజ, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు చందర్‌రాథోడ్, దేవేందర్, అశోక్, కృష్ణ, అర్జున్, జనార్దన్, రాజేశ్వరి పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్క్ విధానాన్ని రద్దు చేయాలి

శివ్వంపేట/మనోహరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట 27, 28 టోకెన్ సమ్మె సందర్భంగా కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల వేతనాలు 5, 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. బకాయి పడిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి శంకర్, బాలకృష్ణ, వసంత, పద్మ, స్వామి, కృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు. జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆసిఫ్ కోరారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మనోహరాబాద్ మండల కేంద్రంలో విధులు బహిష్కరించి టోకెన్ సమ్మె నిర్వహించారు. అలాగే మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

జోగిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అందోలు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో శుక్రవారం టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇటీవల ఈ గురుకులంలో ప్రిన్సిపాల్ సద్గుణ మేరీపై విద్యార్థినులు ఫిర్యాదు చేయడం, ఫిర్యాదు చేసేలా విద్యార్థినులను పురికొల్పారంటూ ఒక ఉద్యోగిపై పోక్సో కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ సహా 19 మంది రెగ్యులర్ టీచర్లు, 12 మంది పార్ట్‌టైం టీచర్లను హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయానికి విచారణ నిమిత్తం పిలిపించుకున్నారు. ఈ క్రమంలో నారాయణఖేడ్ గురుకుల ప్రిన్సిపల్ లింగారెడ్డికి ఈ గురుకుల ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం పలు పార్ట్‌టైం పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. లింగారెడ్డి మాట్లాడుతూ వివిధ గురుకులాలకు చెందిన పలువురు సబ్జెక్ట్ టీచర్లతో 41 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, వాటి వివరాలను జోనల్ అధికారికి పంపామన్నారు.

ఖేడ్‌లో 50 కేజీల ప్లాస్టిక్ కవర్ల సీజ్


ప్లాస్టిక్ కవర్లు సీజ్‌చేసి జరిమానా విధిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను సీజ్‌చేసి, వ్యాపారులకు జరిమానా విధించినట్లు మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేవారు. పలు దుకాణాల నుంచి నుంచి 50 కేజీల కవర్లను సీజ్ చేసి జరిమానా విధించామన్నారు.

ప్రతిభ కనబర్చిన లిఖితకు సన్మానం


చిద్రి లిఖితను సన్మానించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 2023-24 సంవత్సరానికిగాను ఇటీవల వెలువడిన సీఏ ఫలితాల్లో జహీరాబాద్‌కు చెందిన చిద్రి లిఖిత దేశస్థాయిలో 37వ ర్యాంకు సాధించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు పట్టణంలోని సుభాష్ గంజ్‌లో వారి ఇంటికి వెళ్లి లిఖితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామకిరణ్, నాయకులు తులసీదాస్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పార్సిళ్లు సక్రమంగా తూకం చేయాలి

నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్గో సేవల తీరును శుక్రవారం జిల్లా కార్గో లాజిస్టిక్ ఏటీఎం మహ్మదోద్దీన్‌ఇసాక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక కార్గో పాయింట్‌లో ఉన్న పార్సిళ్లను పరిశీలించారు. కార్గో ఇన్‌చార్జి సంతోష్‌కుమార్‌ను అడిగి ప్రతిరోజు బుక్, డెలివరీ అవుతున్న పార్శిళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు, తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

మాసాయిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన బీస శ్రీనివాస్‌ను ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ నియమించారు. శుక్రవారం హైదరాబాద్‌లో శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఐక్యత, హక్కుల కోసం నిరంతరం పోరాటం నిర్వహిస్తామనని తెలిపారు.

అభివృద్ధి.. అవార్డులు

ప్రగతిపథంలో హుస్నాబాద్



డిపో వెనుకలోని అర్బన్ పార్క్

- ఐదేళ్లలో రూ.100 కోట్లకు పైగా పనులు
- మూడు జాతీయ, ఒక రాష్ట్రస్థాయి అవార్డులు
- ఇంటింటికి తడి, పొడి చెత్త సేకరణ
- అధునాతన మానవ మల వ్యర్థాల శుద్ధి కేంద్రం



మున్సిపల్ నూతన కార్యాలయ భవనం

హుస్నాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ పట్టణం నేడు అభివృద్ధి బాటలో పయనిస్తుంది.. గడిచిన ఐదేండ్లలో ఈ మున్సిపాలిటీకి వివిధ అభివృద్ధి పనులకు రూ. 100 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. వివిధ సామాజిక కార్యక్రమాలతో తనదైన ప్రత్యేకతను చాటుకోవడమే కాకుండా నిత్యం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అటు జాతీయ, ఇటు రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులను దక్కించుకుంది. ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణీ చేయడమే కాకుండా మున్సిపల్ వాహనాలతో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేపడుతున్నారు. చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా 5కె, 10కె రన్, యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ప్రతీ సంవత్సరం ఆఫ్ మారథాన్ వంటి పోటీలు నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది హుస్నాబాద్ మున్సిపాలిటీ. అధునాతనమైన మున్సిపల్ కార్యాలయ భవనం, ఇండోర్ స్టేడియం, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, పార్క్‌లు, నర్సరీలు, ఓపెన్ జిమ్‌లు వాడ వాడలా సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం వంటి ప్రగతికి జిందాబాద్ కొడుతూ మరో వైపు అవార్డులతో ముందుకు సాగుతుంది..

ప్రధాన అభివృద్ధి పనులు..

ఈ ఐదు సంవత్సరాల కాలంలో హుస్నాబాద్ మున్సిపాలిటీలో దాదాపు రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి. అయితే ఇందులో నిధులు మంజూరైనప్పటికీ కొన్ని పనులు ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని పనుల్లో చేపట్టారు. రూ. 35 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం (ఈ నిధుల్లో కొన్ని పనులు ప్రారంభం కాలేదు) చేపట్టారు. అలాగే పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు రూ. 17 కోట్లు మంజూరు, పట్టణంలోని జంక్షన్ల అభివృద్ధికి రూ.2 కోట్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరయ్యాయి. ఇక రూ. 40 లక్షలతో ఎల్లమ్మ చెరువు వద్ద ఓపెన్ జిమ్ నిర్మాణం, డిపో వెనుక రూ. 40 లక్షలతో అర్బన్ పార్క్, రూ. 45 లక్షలతో కరీంనగర్ రోడ్డులో నర్సరీ ఏర్పాటు, రూ. 6 కోట్లతో అధునాతనమైన మున్సిపల్ నూతన కార్యాలయ భవనం, రూ. 3 కోట్లతో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ (నిర్మాణంలో ఉంది), స్టేడియం వద్ద రూ. 1.30 కోట్లతో వైకుంఠధామం నిర్మాణం, స్టేడియం నిర్మాణంలో రూ. 30 లక్షలు, రూ. 1 కోటితో మానవ మల వ్యర్థాల శుద్ధి కేంద్ర (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణం, రూ. 1 కోటితో డీఆర్‌సీసీ, కంపోస్టెడ్ షెడ్ నిర్మాణం, రూ. 1.23 కోట్లతో మల్లెచెట్టు వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరిగాయి.

పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు..

హుస్నాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డుల్లోని ప్రతీ కాలనీలో పారిశుధ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు చేసి ఇళ్ల ముందుకు వచ్చే మున్సిపాలిటీ వాహనాలకు అందించే విధంగా చర్యలు చేపట్టారు. ఇందుకు ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. సేకరించిన చెత్తను డీఆర్‌సీసీ షెడ్‌కు తరలించి తడి చెత్తతో సేంద్రియ ఎరువు చేస్తున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఇటీవల అవార్డును కూడా దక్కించుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో కార్యక్రమాల్లో భాగంగా పలు అవార్డులను ఈ మున్సిపాలిటీ దక్కించుకుంది. ఆరోగ్యవంతమైన హుస్నాబాద్‌లో భాగాంగా 2022 నుంచి వరుసగా 5కె రన్, 10కె రన్, హాఫ్ మారథాన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా మహిళలకు 5కె రన్ జరిపారు.

అందరి సహకారంతోనే ..



అందరి సహకారంతోనే అభివృద్ధి పనులతో పాటు ఈ మున్సిపాలిటీకి జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయి. గత ప్రభుత్వంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఇందులో కొన్ని పనులు జరిగాయి. ఇంకా కొన్ని పనులు జరుగబోతున్నాయి. పట్టణ ప్రజలు, పాలకవర్గ సభ్యులు, అధికారుల సహకారం వల్ల జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు అందుకున్నాం. సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు.

-ఆకుల రజిత,
మున్సిపల్ చైర్‌పర్సన్

జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు..

హుస్నాబాద్ మున్సిపాలిటీ 2021 నవంబరులో స్వచ్ఛ సర్వేక్షన్‌లో సౌత్ జోన్ ఫాస్టెస్ట్ మూవర్ సిటీ అవార్డు దక్కించుకుంది. అప్పుడు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో చైర్‌పర్సన్ ఆకుల రజిత కేంద్ర అర్బన్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దుర్గా శంకర్ మిశ్రా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 2022లో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డు, 2023లో క్లీన్ సిటీ అవార్డు, 2024 సంవత్సరంలో చేంజ్ మేకర్ జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో 2022లో ఓడీఎఫ్ ++ సర్టిఫికెట్, 2023లో అస్పిరేషనల్ టాయిలెట్ అవార్డులు వచ్చాయి.



జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి



దేవి(ఫైల్)

కొల్చారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాదా ఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన కొల్చారం మండల పరిధిలోని సంగాయపేట దేవుల నాయక్‌తండాలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన గుగులోత్ దేవి(30), తన భర్త శివతో కలిసి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో బట్టలు ఉతికి ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే మెదక్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. మృతురాలికి కూతురు బిందు, కుమారుడు నితిన్ ఉన్నారు. భర్త శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ వైస్ చైర్మన్, అల్లు మల్లారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్...

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సిద్దిపేట పట్టణం రాజేంద్రనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయం తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ డబ్బులు, అదే సమయంలో సందీప్‌నగర్‌లో బండారు సక్కుబాయి ఇంట్లో తాళం పగలగొట్టి డబ్బులు, బంగారం చోరీ చేశారు. ఈ మేరకు ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి కదలికలపై నిఘా పెట్టారు. దీంతో రంగాధాంపల్లి చౌరస్తా వద్ద ఉన్నారన్న సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడు ఖమ్మం జిల్లా పెనుపల్లి మండలం బేడ బుడగ జంగం కాలనీకి చెందిన తూర్పాటి ప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. అతడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ప్రస్తుతం అతడు సూర్యనగర్ కాలనీలో అల్వాల్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి వద్ద నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.7630 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ నిందితుడు గతంలో ఖమ్మం, హయత్‌నగర్, హుసీన్ పర్తి, పాల్వంచ, మణుగూరు, అశ్వరావుపేట, కోదాడ, సూర్యాపేట, గీసకొండ, మహబూబాబాద్, ఘట్కేసర్, కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసులలో జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు విచారణలో గుర్తించారు. నేరస్తుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ తిరుపతి రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్, బాబులను ఏసీపీ మధు, 3 టౌన్ సీఐ విద్యాసాగర్ అభినందించారు.

జీజీహెచ్ వద్ద పోలీస్ అవుట్ పోస్ట్

- పూర్తిస్థాయిలో ఏర్పాటుకు చర్యలు



సంగారెడ్డిలోని జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఏడాది కిందటనే పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. తాజాగా పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటులో భాగంగా 24 గంటల పాటు పోలీసు సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలోకి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టిందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఆస్పత్రిలో వరుస దొంగతనాలు, చిన్నారుల కిడ్నాప్, సామగ్రి చోరీ, సిబ్బందిపై బాధితుల దాడి తదితర ఘటనల నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. కాగా వచ్చే వారంలో పోలీస్ అవుట్ పోస్ట్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయని ఆ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

అత్యంత ఆవశ్యం

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంటుంది. ఈ ఆస్పత్రిలో సుమారు అన్ని కేడర్ల ఉద్యోగులు, డాక్టర్లు, సిబ్బంది వెయ్యి మంది వరకు పనిచేస్తుండగా, 2 వేల మంది వరకు ఓపీ, ఐపీ ద్వారా నిత్యం పేషెంట్లు వైద్య సేవలు పొందుతుంటారు. పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుతో ఎప్పుడు ఏం జరిగినా వెంటనే తక్షణం స్పందించే వీలు ఉంటుంది. దొంగతనాలు, దాడులు, నేరాలు జరగకుండా ఆస్కారం ఉండటమే కాకుండా ఆస్పత్రిలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుంది. ఈ మధ్యనే మాతా శిశు ఆరోగ్య కేంద్రం నుంచి పసికందు కిడ్నాప్‌తో పాటు ప్రధాన ద్వారం వద్ద మరో బాలుడి అపహరణకు గురైన విషయం తెలిసిందే. సీసీ కెమెరాలు ఉండడంతో చేధించిన పోలీసులు కిడ్నాప్ దొంగలను పట్టుకున్నారు. ఇవే కాకుండా ద్విచక్రవాహనాలు, పేషెంట్ అటెండర్ల సెల్‌ఫోన్లు చోరీ నిత్యకృత్యమైంది. నాలుగు రోజుల కిందట వెల్‌నెస్ సెంటర్, డీఈఐసీ కేంద్రాల్లోని నల్లాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి నల్లాలను ఎత్తుకెళ్లారు. ఇవే కాకుండా దేశ వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బందిపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ అవుట్ పోస్ట్ అత్యంత ఆవశ్యకం.

గ్రామీణ జానపద కళలను కాపాడుకోవాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



కళాకారులతో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ జానపద కళలను ప్రభుత్వం కాపాడుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ కళాకారులు, ఉద్యమ కళాకారుల పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తర తెలంగాణలో ప్రజా పోరాట వీరులకు, కళాకారులకు కొదువలేదన్నారు. కళాకారుల వల్లే ఎన్నో ఉద్యమాలు విజయవంతమయ్యాయన్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన కళాకారులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏకు తిరుపతి, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, డ్యాగల సారయ్య, ఇల్లందుల లక్ష్మన్, గంపల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సమ్మె కనిపిస్తలేదా?

- సమగ్ర శిక్షా ఉద్యోగుల మండిపాటు



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్/చేగుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరవధిక సమ్మె 21వ రోజుకు చేరింది. శుక్రవారం ఉద్యోగులు భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు మాట్లాడుతూ ప్రభుత్వానికి సమ్మె కనిపిస్తాలేదా మండిపడ్డారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణరావు శుక్రవారం చేగుంటలో విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కోహీర్‌ను గ్రామ పంచాయతీగానే కొనసాగించాలి : గ్రామస్థులు

కోహీర్, డిసెంబరు 27 : (ఆంధ్రజ్యోతి) గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసుకోకుండానే కోహీర్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదని ఆ గ్రామ నాయకులు ఏంఏ కలీమ్, నాగరిగారి సంపత్, ఎండీ రెయీస్ అన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం మాట్లాడుతూ కోహీర్‌ను మున్సిపాలిటీగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. గ్రామ జనాభాలో మెజార్టీ శాతం కూలీలు ఉన్న కోహీర్‌ను మున్సిపాలిటీగా మారుస్తే ఉపాధి దొరకక జీవనం కష్టమవుతుందన్నారు. అలాగే వివిధ పన్నులు, చార్జీలు పెరిగి సామాన్యులపై భారం పడుతుందన్నారు. మౌలిక వసతులు, ఆర్థిక రాబడి లేని కారణంగా 1953 నుంచి 1974 వరకు మున్సిపాలిటీ కొనసాగిన కోహీర్‌ను తిరిగి గ్రామపంచాయతీగా మార్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి కోహీర్‌ను గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సిద్ధివినాయక ఆలయంలో ఎంపీ పూజలు

న్యాల్‌కల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో గల సిద్ధివినాయకుడి ఆలయాన్ని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ శుక్రవారం సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా నిర్వహించిన యజ్ఞహోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో గల సిద్ధివినాయకుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు పురోహితులు ఆలయ మర్యాదలతో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, సిద్ధిలింగయ్యస్వామి, చంద్రప్ప పాల్గొన్నారు.

నేడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తరంగిణి



పూజల్లో పాల్గొన్న ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ దంపతులు

జహీరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నేడు అంగన్‌వాడీ టీచర్ల మేళాను తరంగిణి పేరుతో నిర్వహిస్తున్నామని సీడీపీవో అంజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ తరంగిణి మేళాలో ఆట, పాటలు, సామగ్రి ప్రదర్శన, ముఖ్యఅతిథులు ప్రసంగాలు, భాషా-తమాషా, అక్షరసవ్వళ్లు, గీతలు-వ్రాతలు, భలే భలే భావనలు, లెక్కిద్దాం రారండి, అంకెల గారడి తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పట్టణంలోని పస్తాపూర్ సమీపంలో గల ఆర్‌ఎల్లార్ పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన



వర్గల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ధనుర్మాసోత్సవం సందర్భంగా శుక్రవారం లక్ష పుష్పార్చణ ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ వాస్తవ్యులు చింతల విజయలక్ష్మీ, రామ్‌కుమార్‌ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహానాధికారి ఎస్ అన్నపూర్ణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.



మల్లన్నకు కల్యాణ కళ

- రేపే కొమురవెల్లి కోరమీసాల స్వామి మనువు
- నేడు వీరశైవ పీఠాధిపతి రాక
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు

చేర్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండసొరికెలలో వెలిసిన కొమురవెల్లి కోరమీసాల మల్లన్నకు కల్యాణ కళ వచ్చింది. మరికొన్ని గంటలలో ఆలయ ప్రాంగణంలోని తోట బావి ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కల్యాణమంటపంలో మల్లికార్జునస్వామి కేతలమ్మ, మేడలాదేవీలను వివాహమాడనున్నారు. ఆదివారం ఉదయం 10-45గంటలకు స్వామివారి కల్యాణం జరగనున్నది. మార్గశిరమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని వీరశైవాగమశాస్త్రం ప్రకారం నిర్వహించే ఈ తంతుతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వామివారి కల్యాణోత్సవానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రముఖులు హాజరుకానుండటంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 40వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకనుగుణంగా వసతులు కల్పించారు. నేడు వీరశైవపీఠాధి పతి కాశీ జ్ఞానసింహాసన పీఠాధిపతి 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య కొమురవెల్లికి చేరుకోనున్నారు. ఆయన పర్యవేక్షణలో కల్యాణ కైంకర్యం నిర్వహించనున్నారు.

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు

స్వామివారి కల్యాణానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించనున్నారు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కల్యాణ సుముహూర్తానికి వాటిని తీసుకువచ్చి సమర్పించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ తెలిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు ఇతర ప్రముఖులు, నియోజకవర్గ స్థాయి నేతలు హాజరుకానున్నారు.

సీసీ కెమెరాలతో నిఘా..

గతంలో మల్లన్న కల్యాణం సందర్భంగా పలువురు దొంగతనాలకు పాల్పడి భక్తుల ఆభరణాలు అపహరించుకుపోయారు. అలాగే కల్యాణం అనంతరం పోలీసులు ప్రజాప్రతినిధుల వెంబడి వెళ్లిపోవడంతో వేదికవద్ద తోపులాటతో గందరగోళ వాతావరణం నెలకొంటుంది. ఈ క్రమంలో వేదిక ప్రాంగణంలో కలెక్టర్ మను చౌదరి, పోలీసు ఉన్నతాధికారుల సూచన మేరకు సీసీ కెమెరాలు బిగించారు.

మంత్రి ప్రకటన నెరవేరేనా?

గతేడాది స్వామివారి కల్యాణంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన ప్రకటన నెరవేరడంపై సందేహం నెలకొన్నది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గతేడాది స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే కల్యాణం వరకు అమ్మవార్లకు కిరీటాలు ఏర్పాటు చేయిస్తామని ప్రకటించారు. కానీ మరికొన్ని గంటల వ్యవధిలో మాత్రమే మిగిలి ఉండటంతో కిరీటాలు తయారు చేయించే అవకాశం లేకపోవడంతో మంత్రి ప్రకటన నెరవేరని పరిస్థితి నెలకొంది. గతంలోనే కిరీటాల కొలతలు పూర్తిచేయించినప్పటికీ బ్యాంకులో డిపాజిట్ చేసిన బంగారాన్ని కరగదీయించకపోవడం, అందుకు సంబంధించిన ప్రక్రియ నిర్వహణకు అనుమతులు రాకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి. కొద్దిరోజులక్రితం మల్లన్నను దర్శించుకుని తన మనవడి పుట్టువెంట్రుకల మొక్కులు తీర్చుకున్న మంత్రి సురేఖ కిరీటాల ఏర్పాటుపైనా ఆరా తీసి కల్యాణం వరకూ సిద్ధం చేస్తామని పునఃప్రకటన చేశారు. కానీ నేటికీ ఎలాంటి పురోగతి లేదు.

న్యూస్ బాక్స్

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనిల్‌కుమార్



నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఖేడ్ ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర 43వ మహాసభల్లో భాగంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తు విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

బోర్గిని సందర్శించిన ఆలయ ప్రధాన అర్చకులు

నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కంగ్టి మండలం బోర్గి గ్రామాన్ని పూరీ జగన్నాథ ఆలయ ప్రధాన అర్చకులు పండామహరాజ్ శుక్రవారం సందర్శించారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు ఆయనను దర్శించుకున్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆయనను పూలమాలలతో సన్మానించి ఆశీస్సులు పొందారు.

'సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి'

హత్నూర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనవరి 25 నుం,ఇ 28 వరకు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాయిలు పిలుపునిచ్చారు. శుక్రవారం దౌల్తాబాద్‌లో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, సీపీఎం మండల నాయకులు బి.మహిపాల్, శేఖర్, ఇంద్రసేన పాల్గొన్నారు.

ఆర్యభట్ట గణిత పోటీల్లో మంథన్ విద్యార్థి ప్రతిభ

రామచంద్రాపురం: ఆర్యభట్ట గణిత మెరిట్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మంథన్ పాఠశాల పదో తరగతి విద్యార్థి అరవ్ జాతీయస్థాయిలో ప్రతిభను కనబర్చారు. జాతీయస్థాయిలో 5,050 పాఠశాలల నుంచి 5,50,000 మంది విద్యార్థులు పోటీపడగా.. విజయవాడ నుంచి ఎంపికైన 100 మంది విద్యార్థుల్లో అరవ్ ఒకరిగా ఉన్నారన్నారు. జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో అరవ్ గణితంలో ఉత్తమ ప్రతిభను కనబర్చి పురస్కారాన్ని అందుకున్నారని మంథన్ పాఠశాల యాజమాన్యం తెలిపింది.

గడి మైసమ్మదేవికి పూజలు

రేగోడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రేగోడులోని నూతనంగా ప్రతిష్ఠాపన చేసిన గడిమైసమ్మ దేవికి శుక్రవారం అందంగా అలంకరణ, అభిషేకం, పూజలు నిర్వహించామని పురోహితుడు శ్రావణ్‌శర్మ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 13మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ జరిపి రూ.21,500 జరిమానాగా విధించినట్టు ట్రాఫిక్ సీఐ వివరించారు.

పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో శుక్రవారం జరిగిన పీడీఎస్‌యూ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా దేవులపల్లి రమేష్(నంగునూరు), జిల్లా ప్రధాన కార్యదర్శిగా గ్యార గణేష్(సిద్దిపేట)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. వీరితో పాటుగా జిల్లా ఉపాధ్యక్షులుగా హరిప్రసాద్(కోహెడ), జిల్లా సహాయ కార్యదర్శిగా కిరణ్(దుబ్బాక), జిల్లా కోశాధికారిగా కుమార్(గజ్వేల్)తో పాటు మరో నలుగురిని సాయికిరణ్, ఆనంద్, ప్రకాష్, నితిన్‌లను జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చేర్యాల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన కొండా శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన నేపథ్యంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవ వహించి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.60వేలు మంజూరు చేయించారు. ఈ మేరకు పార్టీ మండల నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్ శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మర్కుక్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలం లోని అంగడికిష్టాపూర్ 133కే సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు 3ఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఏఈ సుధీర్ శుక్రవారం తెలిపారు.

చిచ్చుపెట్టిన ఎక్సైజ్ అధికారులు

- కల్లు దుకాణం హద్దులు మార్చడంతో వివాదం
- అధికారుల చుట్టూ రెండు గ్రామాల గీత కార్మికుల ప్రదక్షిణలు



కాసాల గ్రామ శివారులో ఉన్న కల్లు దుకాణం

హత్నూర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల-దౌల్తాబాద్ గ్రామాల గీత కార్మికుల విషయంలో ఎక్సైజ్ అధికారులు అనుసరిస్తున్న విధానం వివాదానికి దారితీసింది. గత కొంతకాలంగా కాసాల గ్రామానికి చెందిన గీత కార్మికులకు సుమారు 13 టీఎఫ్‌టీ లైసెన్సులు వాటన్నింటికీ హద్దులు గ్రామంలోనే ఉన్నాయి. ఎక్కడైతే అధికారులు కేటాయించారో అక్కడే దుకాణాలు కొనసాగిస్తూ స్థానిక గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. అదేవిధంగా సమీప గ్రామమైన దౌల్తాబాద్‌లో సొసైటీ లైసెన్స్ ఉండడంతో వారు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలోనే కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల కాసాల టీఎఫ్‌టీ లైసెన్సులు కొందరి అభ్యర్థన మేరకు ఎక్సైజ్ అధికారులు హద్దులు మార్చుతూ దౌల్తాబాద్-కాసాల ప్రధాన రోడ్డుకు పక్కనే కేటాయించారు. దీంతో కాసాలకు చెందిన కొందరు గీత కార్మికులు తమ దుకాణాలను నూతన హద్దులు ఉన్నచోటుకు మార్చారు. అప్పటి నుంచి తమ దుకాణంలో గిరాకీ కావడం లేదని దౌల్తాబాద్‌కు చెందిన దుకాణదారులు జిల్లా ఎక్సైజ్ అధికారులకు కలిసి వేడుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా గతంలో పనిచేసిన ఎక్సైజ్ అధికారులు మా గ్రామానికి సమీపంలో హద్దులు కేటాయించారని జిల్లా అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. జోగిపేట ఎక్సైజ్ అధికారులు కాసాల, దౌల్తాబాద్ గీత కార్మికులను పిలిపించి పలు విధాలుగా నచ్చజెప్పి, గతంలో మాదిరిగానే దుకాణాలను నిర్వహించుకోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో కొద్దిరోజులుగా కాసాల గ్రామ శివారులో కొనసాగుతున్న దుకాణాన్ని అధికారులు మూసి వేయించినట్లు గీత కార్మికులు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా రెండు గ్రామాల గీత కార్మికులు ఎవరి గ్రామంలో వారు దుకాణాలు నిర్వహిస్తుండగా, ఎక్సైజ్ అధికారులు హద్దులు మార్చి రెండు గ్రామాల మధ్య వివాదానికి తెరలేపారన్న విమర్శలు ఉన్నాయి.

వారిని మాట్లాడుకోమని చెప్పాం

దౌల్తాబాద్- కాసాల కల్లు దుకాణాల విషయమై ఇటీవల రెండు గ్రామాల గీత కార్మికులు తమ వద్దకు రాగా, వారిని మాట్లాడుకోమని చెప్పాం. అప్పటివరకు కాసాల శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని నిలిపి వేయాలని సూచించాం. ఇరువురు చర్చించుకొని ఓ ఒప్పందానికి వచ్చాక నూతనంగా ఏర్పాటు చేసిన దుకాణం నిర్వహించుకోవాలని స్పష్టం చేశాం.

- సుధీర్‌రెడ్డి, జోగిపేట్ ఎక్సైజ్ సీఐ

యువకులు మృతిచెందడం బాధాకరం

- అధైర్య పడకండి.. రెండు కుటుంబాలకు అండగా ఉంటా
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు



కిష్టాపూర్‌లో విద్యుత్‌శాఖ జిల్లా అధికారులతో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

కొల్చారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతిచెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం మృతులు నవీన్, ప్రశాంత్ కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటూ.. తనవంతుగా ఒక కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తానని పేర్కొన్నారు. అలాగే జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రెండు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేవిధంగా కృషి చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకుని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. ఏడుపాయల వన దుర్గామాత దర్శనానికి ఏ ముఖ్యమంత్రి రాలేదని, సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి రూ.35 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.2 కోట్లు చెల్లించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



కిష్టాపూర్‌లో బాధిత కుటుంబాలను ఓదార్చున్న బీజేపీ నాయకులు

కొల్చారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ వైర్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో రెండు నిండు ప్రాణాలు పోయాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మల్లేశంగౌడ్ తెలిపారు. శుక్రవారం బాధితులు నవీన్‌యాదవ్, ప్రశాంత్‌యాదవ్ కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంధ్య థియేటర్ వద్ద రేవతి మృతికి కారణమైన అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేశారు. ఇక్కడ కూడా ఇద్దరు యువకులు మృతిచెందారని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు రూ.2 కోట్ల నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్, నాని, హరీశ్, నానితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ భూపాల్ కుమారుడికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గ్రామానికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, ఇస్మాయిల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ఆగని ఆక్రమణలు

- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు



అటవీ భూమిని ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసుకున్న దృశ్యం

హత్నూర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పలువు మీది పోచమ్మ ఆలయ సమీపంలో అటవీ భూముల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. కొన్ని దశాబ్దాలుగా ఆలయ సమీపంలో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్న స్థానికులు కొందరు, అక్కడ భక్తుల తాకిడి ఎక్కువ కావడం.. మద్యం, కల్లు ఇతరత్రా సరుకులకు భారీగా గిరాకీ పెరగడంతో దినదినం దుకాణాలను విస్తరిస్తూ, ఒక్కొక్కరు సుమారు అర ఎకరం, ఎకరం వరకు ఆక్రమిస్తూ రేకుల షెడ్లు వేశారు. భారీ వృక్షాలను నేలకూలుస్తున్నా అటవీశాఖ అధికారులకు మాత్రం పట్టడం లేదు. అటవీ భూముల ఆక్రమణలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో మేల్కొన్న అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆ దుకాణాలు పూర్తిగా అటవీ భూమిలో ఉండడంతో పాటు ఎకరాల కొద్దీ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అటవీ భూముల్లో అక్రమంగా వేసుకున్న షెడ్లను స్వచ్ఛందంగా తొలగించాలని దుకాణదారులకు నోటీసులు జారీచేశారు. రెండు సార్లు నోటీసులు జారీచేసినా ఆక్రమణదారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన గడువు ముగిసి సుమారు నెలరోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలకు పూనుకోకపోవడంలో అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా అధికారుల తీరు పట్ల అనుమాన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శాలినిని 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా సంప్రదించగా.. సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు.



ఆక్రమణదారులకు అటవీశాఖ అధికారులు జారీ చేసిన నోటీసులు



మెదక్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నేతలు



నర్సాపూర్: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షులు, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తదితరులు

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు

ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ఆయా మండలాల్లో కాంగ్రెస్ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. ప్రధానిగా, ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప మేధావి మన్మోహన్ సింగ్ అని కొనియాడారు.

- న్యూస్ నెట్‌వర్క్



తూప్రాన్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జహీరాబాద్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకే వైద్య శిబిరం

- మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి



సంగారెడ్డిలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యాలను కాపాడాలనే సదుద్దేశంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని నాల్‌సాబ్‌గడ్డలో శుక్రవారం మెడ్వాన్ సంస్థ ఆధ్వర్యంలో ఎంఎన్‌ఆర్ డాక్టర్లచే ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లలో పనిచేస్తున్న గృహ కార్మికులు సరైన వైద్యమందక అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా వారికి వైద్యమందించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అమీర్‌ఖాన్, మెడ్వాన్ సంస్థ కో ఆర్డినేటర్లు స్వప్న, ముజీబ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీరోడ్డు పనులు



మంగల్‌పేటలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

నారాయణఖేడ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని పలు కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చాలా కాలనీల్లో అంతర్గత రోడ్లు, మట్టి రోడ్లుగా ఉండడంతో వర్షాకాలంలో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆయా కాలనీల్లో సీసీరోడ్ల కోసం రూ.20 లక్షలు మంజూరు కాగా.. పనులు కొనసాగుతున్నాయి. పనులు నాణ్యతగా చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సదరు కాంట్రాక్టర్‌కు సూచిస్తున్నారు.

శ్రీనివాసచౌదరికి 'మైనంపల్లి' పరామర్శ



అంజమ్మ భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు

మెదక్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచవరానికి చెందిన సిద్ధార్థ విద్యాసంస్థ చైర్మన్ శ్రీనివాస్‌చౌదరి అమ్మమ్మ అంజమ్మ వయోభారంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వారి కుటుంబసభ్యులను పరామర్శించి అంజమ్మ భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాచవరం మాజీ సర్పంచ్, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు సుప్రభాతరావు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



సంగారెడ్డిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సంగారెడ్డిలో సీఐటీయూ నాయకులు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు యాదగిరి, నర్సింలు, రాజేశ్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు



మన్మోహన్‌సింగ్ మృతిపట్ల సంతాపం తెలుపుతున్న నీలం మధుముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు

జిన్నారం, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. శుక్రవారం కొడకంచిలో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణను మధు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. ప్రధానిగా, ఆర్థిక వేత్తగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి, కాంగ్రెస్‌కు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజుగౌడ్, సీతారం, నరసింహ తదితరులు పాల్గొన్నారు,

గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు

మిరుదొడ్డి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీశ్ హెచ్చరించారు. శుక్రవారం అక్బర్‌పేటచౌరస్తాలో డాగ్‌స్క్వాడ్‌తో పాన్‌షాపుల్లో, కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా మత్తుపదార్థాలను విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. యువత చెడుఅలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.